క్లుప్తంగా

వర్గీకరణతోనే న్యాయం



మాట్లాడుతున్న గోటివాడ సామ్రాట్ కుమార్

సబ్బవరం: షెడ్యూల్ కులాలను ఏబీసీడీగా వర్గీకరిస్తేనే సామాజిక న్యాయం దక్కుతుందని ఎంఆర్‌పీఎస్ జిల్లా కన్వీనర్ గోటివాడ సామ్రాట్ కుమార్ అన్నారు. మండలంలోని ఎంఆర్‌పీఎస్ ముఖ్య కార్యకర్తలతో పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ ఇందుగబిల్లి గోపి అధ్యక్షతన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ టార్గెట్ 50 డేస్ గో టూ విలేజ్ కార్యక్రమం విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉద్యమాన్ని గ్రామ స్థాయిలో చురుగ్గా విస్తరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటిపల్లి గౌరి, కొమ్ము కోటి అప్పారావు, మారేడుపూడి కోటి, ఇందుగబిల్లి హరి పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మతల్లి పండగ



పరవాడ: ముత్యాలమ్మపాలెం గంగపుత్రుల ఇలవేల్పు బంగారమ్మతల్లి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. గ్రామ పొలిమేరలో కొలువుదీరిన అమ్మవారిని ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. చీరలు, పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రికి డప్పు వాయిద్యాలు, నేల డ్యాన్సులు, తప్పెటగుళ్ల నడుమ అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. భారీ బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు మహోత్సవం నిర్వహించారు. రాత్రికి ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహోత్సవంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

15న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 15న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

మహిళా కళాశాలలో యోగా కార్యక్రమం



యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో యోగా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి విద్యార్థులకు యోగా విశిష్టత గురించి వివరించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ ఎ. హైమావతి, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్ కె. ప్రశాంతి, ట్రైనర్ బి. సునీల్, విద్యార్థినులు పాల్గొన్నారు.

భక్త జన సంద్రం

- అడవివరం పైడితల్లి అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు
- సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న డిప్యూటీ ఈవో సుజాత, ఆలయ అధికారులు



సతకంపట్టు వద్ద భక్తజన సందోహం మధ్య అంజలి రథోత్సవం

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి, అడవివరం గ్రామ దేవత పైడితల్లి అమ్మవారి పండగ మంగళవారం వైభవంగా జరిగింది. ఏడు గ్రామాల ఆరాధ్య దేవతగా విరాజిల్లుతున్న అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామస్తులు కొత్తవీధిలోని ఆలయానికి పోటెత్తారు. ఆలయ ప్రాంగణం భక్త జన సంద్రంగా మారింది. అమ్మవారిని పూలతో అలంకరించారు. భక్తులు పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పండ్లు, వడపప్పు, చలివిడిని నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారికి దేవస్థానం తరపున డిప్యూటీ ఈవో సుజాత నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు సమర్పించారు. గాంధీనగర్‌లోని సతకంపట్టు వద్ద ఉన్న పైడితల్లి అమ్మవారి ఘటాల గుడి వద్ద కూడా భక్తులు అధిక సంఖ్యలో మొక్కులు చెల్లించుకున్నారు. సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో అధికారులు ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయం వద్ద క్యూలు, టెంట్లు, షామియానాలు, మంచినీరు ఏర్పాటు చేశారు. ఉచిత ప్రసాద వితరణ చేశారు. దేవస్థానం సెక్యూరిటీ గార్డులు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అడవివరం పురవీధుల్లో పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. దేవస్థానం ఏఈవోలు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అమ్మవారి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లండ వెంకటరమణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు, 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, నాయకులు పీతల అప్పలరాజు, కర్రి సత్తిబాబు, గంట్ల కిరణ్, దొంతల సంతోష్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో అనుపు మహోత్సవం

మంగళవారం రాత్రి అమ్మవారి అనుపు మహోత్సవాన్ని గ్రామ సంప్రదాయం ప్రకారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గాంధీనగర్‌లోని సతకం పట్టు నుంచి అమ్మవారి ఘటాలు, గరగలను పూజారి వంశీయులైన లండ కుటుంబీకులు, గ్రామస్తులు, మహిళలు శిరస్సుపై పెట్టుకుని కొత్తవీధిలో ఉన్న ఆలయం వరకు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. అమ్మవారి ఘటాలకు దారిపొడవునా భక్తులు హారతులిచ్చారు. అంతకు ముందు ఉదయం గాంధీనగర్‌లోని అమ్మవారి సతకంపట్టు వద్ద అంజలి రథోత్సవ సేవ కనుల పండువగా సాగింది. గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఈ ఉత్సవాన్ని కనులారా వీక్షించారు. భక్తులతో సతకంపట్టు ప్రాంతం కిటకిటలాడింది. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, పూజారీ వంశీయుడు లండ వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది.



మజ్జిగ అందజేస్తున్న గౌరీ సేవా సంఘం ప్రతినిధులు

➡ స్థానిక గౌరీ కల్యాణ మండపం వద్ద వేపగుంట గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సంఘం ప్రతినిధి భీశెట్టి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు మళ్ల బలరామ్, సహాయ కార్యదర్శి శరగడం సత్యనారాయణ పాల్గొన్నారు.

సింహాచలం : అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి పండగని పురస్కరించుకుని ఆలయం వద్ద స్థానిక గణేష్ యువజన సేవా సంఘం సభ్యులు మజ్జిగ, ప్రసాదం పంపిణీ చేశారు. యువజన సేవా సంఘం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రసాదం స్వీకరించారు.



పైడితల్లిని దర్శించుకుంటున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



అనుపు మహోత్సవంలో ఘటాలను తీసుకొస్తున్న పూజారి వంశీయులు

జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ



జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేస్తున్న సర్పంచ్ సుజాత

పరవాడ: విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక ధన్యావాదాలు తెలియజేస్తున్నామని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత అన్నారు. ముత్యాలమ్మపాలెం జెడ్పీ పాఠశాల, దిబ్బపాలెం, జాలరిపేట గ్రామాల్లోని మండల పరిషత్ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం సమకూర్చిన జగనన్న విద్యా కానుక కిట్లను ఆమె మంగళవారం అందజేశారు. ప్రభుత్వం సమకూర్చిన విద్యా కానుక కిట్లను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి సోమునాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత

సబ్బవరం: మండలంలోని నారపాడు గ్రామంలో ఇటీవల ఓ మహిళ పాముకాటుతో మృతి చెందడంతో వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10 వేలు తక్షణ సహాయాన్ని అందించారు. గ్రామ సర్పంచ్ మామిడి శంకరరావు మంగళవారం కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. ఈ నెల 1న రాజాన పరదేశమ్మ పొలంలో పాము కాటుకు గురికావడంతో మృతి చెందిందని తెలిపారు. మిగిలిన బీమా సహాయాన్ని త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ కో ఆప్షన్ సభ్యుడు గోర్లి నూకరాజు, మామిడి కొండాజీ పాల్గొన్నారు.

కళాశాలలో 'నారాయణ అండ్ కో' సందడి



విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న చిత్ర దర్శకుడు చిన్న పాపిశెట్టి

అగనంపూడి: దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో నారాయణ అండ్ కో చిత్ర యూనిట్ సందడి చేసింది. సినిమా ప్రమోషన్‌లో భాగంగా కళాశాలను సందర్శించి, అక్కడి విద్యార్థులతో చిట్‌చాట్ చేశారు. చిత్ర కథానాయకుడు సుధాకర్ కాముకల, కథానాయిక ఆర్తి, దర్శకుడు చిన్న పాపిశెట్టి, నటి ఆమని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా చిత్రాన్ని రూపొందించామన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా సాగింది. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ బడ్జెట్ సమావేశం



గ్రంథాలయ బడ్జెట్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

డాబాగార్డెన్స్: జిల్లా గ్రంథాలయ సంస్థ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్, సర్వసభ్య సమావేశం మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి అధ్యక్షతన నిర్వహించారు. పౌర గ్రంథాలయ శాఖ సంచాలకుడు ఆమోదించి పంపిన వివిధ పద్దుల కింద ఖర్చు చేసేందుకు నిర్వహించిన సమావేశంలో వివిధ పద్దుల కింద ఖర్చు చేయాల్సిన మొత్తాలను చర్చించి ఆమోదించారు. సమావేశంలో కొండా రాజీవ్‌గాంధీ, గ్రంథాలయ సంస్థ సభ్యురాలు జ్యోతి, వయోజన విద్య ఉప సంచాలకుడు ఎస్. సుబ్రహ్మణ్యవర్మ, జిల్లా పంచాయతీ అధికారి ఎం, వాసు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకట్రావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణ పతక విజేతకు సత్కారం



దుర్గా స్ఫూర్తి శ్రీని సత్కరిస్తున్న ప్రతినిధులు

పెదగంట్యాడ: ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఏషియన్ చెస్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన సత్తి దుర్గా స్ఫూర్తి శ్రీని రాఘవరెడ్డి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు మంగళవారం సత్కరించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండర్ ద్వారంపూడి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ స్ఫూర్తి శ్రీలో అసాధారణ ప్రతిభ ఉందన్నారు. ఇటీవల విజయవాడలో నిర్వహించిన స్టేట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కూడా సత్తా చాటిందన్నారు. ఈ పోటీలలో బంగారు పతకం సాధించడంతో పాటు బెస్ట్ బాక్సర్‌గా నిలిచిందన్నారు. క్రీడల్లో రాణిస్తున్న ఆ బాలికను, ఆమె తల్లిదండ్రులు సత్యనారాయణరెడ్డి, నాగలక్ష్మిలను సత్కరించారు. కార్యక్రమంలో జాగారపు శ్రీను, కొవ్వూరి గోపాలకృష్ణారెడ్డి, తమలంపూడి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువకుని మృతి కేసులో చురుగ్గా దర్యాప్తు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు కాళికానగర్ మింది పంప్ హౌస్ సమీపంలోని కాలువలో లభించిన యువకుడి మృతదేహం కేసులో చురుగ్గా దర్యాప్తు చేస్తున్నామని, ఇప్పటి వరకు పురోగతి కనిపించలేదని గాజువాక పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం లభించిన మృతదేహం దల్లి శివదిగా నిర్ధారించిన పోలీసులు ఆ స్థలంలో సోమవారం క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. స్థానికులను విచారించి వివరాలు సేకరించారు. మృతుని స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువులతోపాటు శివ ప్రేయసి, ఆమె కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంతాల వారిని విచారించి, వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. శివ ప్రమాదవశాత్తు చనిపోయాడా..?, ఎవరైనా హతమార్చారా..? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా కేసు ఛేదించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని గాజువాక సీఐ ఎల్.భాస్కరరావు, ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు.

తల్లి చెంతకు కుమార్తె

గోపాలపట్నం: పాత గోశాల వద్ద తల్లితో నివాసముంటున్న ఓ బాలిక సోమవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోపాలపట్నం పోలీసులు ఆమెను వెదికి పట్టుకుని, తల్లి చెంతకు చేర్చారు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రామలక్ష్మి ఓ ఆఫీస్‌లో అటెండర్‌గా పని చేస్తోంది. ఈ నెల 12న ఆమె విధులకు వెళ్లిన సమయంలో బాలిక బయటికి వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో తల్లి రామలక్ష్మి గోపాలపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఈదుల నరసింహారావు వెంటనే స్పందించి సెల్‌ఫోన్ నెట్‌వర్క్ ద్వారా మాడుగులలో ఉన్నట్లు గుర్తించారు. ఇక్కడి నుంచి సిబ్బందిని పంపి మంగళవారం తీసుకొచ్చి తల్లికి అప్పగించారు.

మాతృ మరణాల నివారణ బాధ్యత వైద్యులదే



మాతృ మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : జిల్లాలో మాతృ మరణాలు సంభవించరాదని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల శ్రీకాంత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒక మాతృ మరణం సంభవించిందన్నారు. ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కారాదన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మాతృ మరణాలు జరిగితే దానికి వైద్యులు బాధ్యత వహించాల్సి ఉందన్నారు. గర్భిణుల వివరాల నమోదు నాటి నుంచి ప్రసవించే వరకు సక్రమంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, ఐసీడీఎస్ పీడీ డి.వెంకటలక్ష్మి, వీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషాప్రసాద్, గైనిక్ వైద్యులు డాక్టర్ సువర్ణ, డాక్టర్ శ్రీలక్ష్మి, మహిళా ఆరోగ్య అధికారి డాక్టర్ ఉమావతి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ఎస్‌సీబీ నాయుడు, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వేళ సంజీవనిలా..

అత్యవసర వేళ అందించే రక్తం సంజీవని వంటిదే. అందుకే రక్తదానం ప్రాణదానంతో సమానం అంటారు. ప్రమాదాల్లో గాయపడిన వారికి, శస్త్రచికిత్స సమయాల్లో రక్తం అత్యావశ్యకం. ఆ సమయంలో రక్తం అందుబాటులో లేక ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదు అనే సత్సంకల్పంతో స్టీల్‌ప్లాంట్ యువకార్మికుల చొరవతో ఆవిర్భవించిందే..ఉక్కు రక్తదాతల సంఘం (స్టీల్ ఎంప్లాయిస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్- సెబ్డా). వీరు అందిస్తున్న రక్తం వేలాది మంది ప్రాణాలను నిలుపుతోంది.



సెబ్డా ఆవిర్భావంలో స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు

- వేలమందిని ఆదుకుంటున్న 'సెబ్డా'
- రోగులకు నేరుగా రక్తదానం
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఉక్కు ఉద్యోగి పోలీసు నాయుడు (ఫైల్ ఫొటో)

ఉక్కునగరం: సాటివారికి సాయం చేయడంలో ఎంతో తృప్తి ఉంటుంది. మనం ఇచ్చే రక్తం ఒక నిండు ప్రాణాన్ని నిలుపుతుంది అంటే అది అన్నింటినీ మించిన సాయమే అవుతుంది. అయితే, బ్లడ్‌బ్యాంకులు నిర్వహించడం, రక్తం నిల్వ ఉంచడం, అవసరమైన గ్రూప్ లేకపోతే రక్తదాతలను అన్వేషించడం కంటే కొంతమంది రక్తదాతలను ఎప్పుడూ సిద్ధంగా ఉండేలా చేసి నేరుగా రక్తాన్ని దానం చేసేలా ప్రోత్సహిస్తే నగరానికి దూరంగా ఉన్న స్టీల్‌ప్లాంట్ వంటి ప్రాంతాల వారికి అనువుగా ఉంటుందని భావించారు కొంతమంది యువ కార్మికులు. వారి కృషి ఫలితంగా ఏర్పడింది ఉక్కు రక్తదాతల సంఘం. కొమ్మోజు ఉమామహేశ్వరరావు (టీపీపీ), ఎం. సందీప్ (సీఈడీ), వై.అప్పారావు (డబ్ల్యూఎండీ), కె.వి. అప్పారావు (డబ్ల్యూఎండీ), డి. బాబూరావు (సీఈడీ), పోలీసు నాయుడు (బీఎఫ్), ఎం. గణేష్‌కుమార్ (వైర్ రాడ్ మిల్), వైకుంఠరావు (ఈఆర్ఎస్), రాజశేఖర్ (డబ్ల్యూఎండీ) 2012లో స్టీల్ ఎంప్లాయిస్ బ్లడ్ డోనర్స్ అసోసియేషన్ (సెబ్డా)ను రిజిస్టర్ చేశారు.

వాట్సాప్.. ఫోన్ ద్వారానే...

సుమారు వెయ్యి మంది ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులతో వివిధ రక్త గ్రూపులతో కూడిన రక్తదాతలను సిద్ధం చేశారు. ఎటువంటి కార్యాలయం లేకుండానే కేవలం వాట్సాప్, మొబైల్ ఫోన్ల ద్వారానే అత్యవసర రోగుల పరిస్థితులకు అనుగుణంగా రక్తదాతలను పంపడం సెబ్డా ప్రత్యేకత.

ఉక్కు జనరల్ ఆస్పత్రిలోని బ్లడ్ బ్యాంక్ నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటంతో పాటు బయట బ్లడ్ బ్యాంక్‌ల నుంచి రక్తాన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రి యాజమాన్యం అంగీకరించని పరిస్థితులను చూసిన సంఘం ప్రతినిధులు ఉక్కు జనరల్ ఆస్పత్రి రోగులకు మొదటి ప్రాధాన్యతగా రక్తదాతలను పంపడం ప్రారంభించారు. ఈ విధంగా ఇప్పటి వరకు సుమారు 3 వేల మంది రోగులకు అవసరమైన దాతలను పంపి రక్తం అందజేశారు. కరోనా సమయంలో ప్లాస్మా కొరత ఉన్న రోగులకు ప్లాస్మా అందించి తమ వంతు సాయం అందించారు. ఇందుకోసం రోగుల నుంచి ఎటువంటి రుసుం వసూలు చేయటం లేదు.

బ్లడ్ బ్యాంకులతో అవగాహన

నగరంలోని పలు బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వలు తగ్గినప్పుడు వారికి అవసరమైన గ్రూప్ రక్తానికి సంబంధించిన దాతలను పంపిస్తుంటారు. అదే విధంగా అత్యవసర పరిస్థితుల్లో సెబ్డా వద్ద అవసరమైన రక్తం లేనప్పుడు ఆయా బ్లడ్ బ్యాంక్‌ల నుంచి తీసుకునేలా అవగాహన కుదుర్చుకున్నారు. నగరంలోని యువతతో ఏర్పడిన 'జనరేషన్ యువ' తో ఉన్న అవగాహన మేరకు అవసరమైనప్పుడు రక్తదాతలను పంపుతుంటారు.

రక్తం అవసరమైన వారు రక్తదాతల కోసం సెబ్డా ప్రతినిధులు ఎం.సందీప్ (90322 11188), కె. ఉమామహేశ్వరరావు (98855 61161)లను సంప్రదించవచ్చు.

ఆపదలో ఉన్నవారికి రక్తం అందిస్తున్నాం



ఆపదలో ఉన్నవారికి రక్తం అందుబాటులో ఉంచాలనేదే సెబ్డా ధ్యేయం. రక్తం లేకపోవడం వల్ల వ్యక్తి ప్రాణాలకే ముప్పు వచ్చిందనే పరిస్థితి రాకుండా చూడటానికి శాయశక్తులా ప్రయత్నిస్తున్నాం. ఇందులో భాగంగా రక్తదాతల సంఖ్య పెంచడానికి కృషి చేస్తున్నాం.

– ఎం. సందీప్, సెబ్డా కన్వీనర్

21 సార్లు రక్తదానం



బ్లడ్ క్యాంప్‌లను నిర్వహించడం ద్వారా బ్లడ్ బ్యాంకుల్లో రక్తం నిల్వ ఉంచడం కాకుండా అవసరమైనప్పుడు రక్తదాతలను ఏర్పాటు చేస్తున్నాం. నేను 2015 నుంచి ఇప్పటికి 21 సార్లు రక్తదానం చేశాను. మూడు సార్లు ప్లాస్మా దానం చేశాను. ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు రక్తదాతలు మరింత మంది ముందుకు రావాలి.

– బి. వైకుంఠరావు, సెబ్డా వర్కింగ్ ప్రెసిడెంట్

జెడ్పీ హైస్కూల్‌కు కుర్చీల వితరణ

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు 1990–91 పూర్వ విద్యార్థులు ఎమ్మెల్యే గణబాబు చేతుల మీదుగా కుర్చీలు అందించారు. ఇటీవల వీరు ఇక్కడి పాఠశాలలో కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అక్కడితో ఆగకుండా చదువుకున్న పాఠశాలకు చేతనైన సాయం చేయాలని నిర్ణయించుకుని పాఠశాలకు అవసరమయ్యే కుర్చీలను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్ హెప్సిబాకు వీటిని అందించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాల రుణం తీర్చుకునేందుకు మంచి కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సువ్వాడ మురళీకృష్ణ, సొప్ప సూర్యనారాయణ, రాజు, పైడిరాజు, ఆనంద్, శివ, శ్రీను, అప్పలరాజు, సుగుణ, నాగేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గాయత్రి ఆలయ వార్షికోత్సవం



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ శానాపతి వసంత తదితరులు

సింహాచలం : చినముషిడివాడ దరి శ్రమశక్తినగర్‌లో ఉన్న పంచముఖ గాయత్రి దేవి ఆలయ 13వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు విశేషంగా నిర్వహించారు. విష్ణు సహస్రనామ పారాయణ, లక్ష్మీ సహస్ర నామ పారాయణ చేశారు. అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. అమ్మవారిని 97వ వార్డు కార్పొరేటర్ శానాపతి వసంత దంపతులు, వైఎస్సార్‌సీపీ 97వ వార్డు అధ్యక్షుడు మెంటి మహేష్ దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త నరసింహమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.